క్లుప్తంగా

రమాబాయి అంబేద్కర్ త్యాగం మరువలేనిది



నివాళులర్పిస్తున్న బీఐఎస్ సభ్యులు

భైంసాటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ త్యాగం మరువలేనిదని బుద్ధిస్ట్ సొసైటీ నాయకులు అన్నారు. శనివారం భైంసాలోని ఏపీనగర్, రాహుల్‌నగర్ మైత్రేయ బుద్ధవిహార్‌లో రమాబాయి స్మృతిదినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఐఎస్ అధ్యక్షులు ప్రసంజీత్ హేమ్లే, అక్షయ్, ఏక్‌నాథ్, నివర్తి, రేఖాబాయి, తదితరులున్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంబరాలు



మిఠాయిలు తినిపించుకుంటున్న పంచాయతీ కార్యదర్శులు

ముధోల్: జేపీఎస్‌లను ప్రభుత్వం రెగ్యులర్ చేస్తున్నట్లు ప్రకటించడంపై మండల పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, ఎంపీడీవో సురేష్‌బాబుతో శనివారం కలిసి వారు సంబరాలు జరుపుకున్నారు. ఒకరినొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



బాబాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో శేఖర్

లక్ష్మణచాంద: నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని పంచాయతీ అధికారులకు ఎండీపీవో శేఖర్ సూచించారు. మండలంలోని బాబాపూర్, నర్సాపూర్, మల్లాపూర్, చింతల్‌చాంద గ్రామాల్లోని నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండ తీవ్రతకు నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా ప్రతిరోజు నీరందించాలన్నారు. చలువ పందిళ్లు వేయాలని సూచించారు. గ్రామాల్లో నిత్యం సేకరించే చెత్తను తడి,పొడిగా వేరు చేసి వాటి నుంచి సేంద్రియ ఎరువుగా తయారు చేయాలన్నారు. ఎంపీవో నసీరుద్దీన్, బాబాపూర్ సర్పంచ్ శ్రీవిద్య, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఉన్నారు.

వంతెన పనులు ప్రారంభించాలి



మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్, అంబేద్కర్‌నగర్ శివారులో గల రెంకోని వాగుపై నిర్మించ తలపెట్టిన వంతెన నిర్మాణ పనులు ప్రారంభించి, త్వరగా పూర్తిచేయాలని వైఎస్సార్‌టీపీ పట్టణ అధ్యక్షుడు పానగంటి నరేశ్, యూత్ మండల అధ్యక్షుడు ఎగుర్ల మహేశ్ పేర్కొన్నారు. స్థానిక విశ్రాంతి భవనంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో వారం రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పాడి రైతులకు రుణాలు

లోకేశ్వరం: పాడి రైతులకు రుణాలు అందజేస్తామని అబ్దుల్లాపూర్ ఎస్‌బీఐ మేనేజర్ తిరుమలేశ్ అన్నారు. మండలంలోని పుస్పూర్ గ్రామంలో రుణాల కోసం దరఖాస్తును చేసుకున్న రైతులను శనివారం ఆయన కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సూపర్‌వైజర్ దండే రమేశ్, రైతులు గన్ను నర్సారెడ్డి, పోతారెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాలమిత్రలు ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు వంటల పోటీలు

భైంసారూరల్: కోతల్‌గాం గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లకు చిరుధాన్యాలపై శనివారం వంటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ చిరుధాన్యాల్లో పోషకగుణాలు,పీచు పదార్థాలు, ఐరన్ ఉంటాయన్నారు. గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

రైతు చైతన్య సదస్సులేవీ?

- మూడేళ్లుగా నిర్వహించని వైనం
- వానాకాలం పంటలపై అవగాహన కరువు
- అధికారుల సలహాలు, సూచనలు లేవు
- ఏ పంటలు వేయాలో అయోమయంలో రైతులు



జౌలా(బి) గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి (ఫైల్)

తానూరు: పంటల సాగులో సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రతిఏటా ఏప్రిల్, మే నెలల్లో మన తెలంగాణ–మన వ్యవసాయం పేరిట ప్రభుత్వం గ్రామాల్లో రైతు చైతన్య సదస్సులు నిర్వహిస్తోంది. అయితే గత మూడేళ్ల నుంచి ఈ సదస్సుల జాడ పత్తాలేకుండా పోయింది. గతంలో కరోనా కారణంగా, ఈ ఏడాది ఏ కారణంతోనే సదస్సు నిర్వహించడం లేదు. ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో ఏ పంటలు వేసుకోవాలో రైతులకు తెలియక అయోమయంలో పడ్డారు. అసలు మన తెలంగాణ–మన వ్యవసాయం కార్యక్రమం నిర్వహిస్తారా..లేదా అన్న సందేహం వారిలో వ్యక్తమవుతోంది.

రైతు సదస్సులు లేనట్టేనా?

గతంలో ప్రతి ఏటా వానాకాలం ప్రారంభం ముందు వ్యవసాయశాఖతోపాటు 12 అనుబంధ శాఖల అధికారులు గ్రామాల వారీగా రైతుల వద్దకు వెళ్లి పంటల సాగుపై అవగాహన కల్పించేవారు. భూసార పరీక్షలు ఆవశ్యకత, పంటల మార్పిడి, సేంద్రియ ఎరువుల వాడకం తదితర అంశాలపై తెలియజేసేవారు. గిట్టుబాటు ధర రానప్పుడు రుణం పొందే విధానం, పంటలకు ఆశించే చీడపీడల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాడి పశువుల ద్వారా అభివృద్ధి, పశుసంవర్ధకశాఖ అందిస్తున్న రాయితీలు, విత్తనోత్పత్తికి ప్రోత్సాహంపై కరపత్రాలు.వాల్‌పోస్టర్లు ద్వారా ప్రచారం చేసేవారు. అధికారులు బృందాలుగా ఏర్పడి పల్లెల్లో పర్యటించి పంటలపై రైతుల్లో సందేహాలను నివృత్తిచేసేవారు.

(జిల్లాలో గతేడాది వానాకాలం సాగు)

పంటలు	ఎకరాలు
పత్తి	1.60 లక్షల
వరి	95 వేలు
సోయా	65 వేలు
జొన్న	20 వేలు
కంది	22 వేలు
మొక్కజొన్న, తదితర	57 వేలు
మినుము, పెసర	వెయ్యి ..

అవగాహన కల్పిస్తే.. అధిక దిగుబడులు

రైతు చైతన్య సదస్సులో భాగంగా ఏటా అధికారులు గ్రామాలను సందర్శించి వర్షపాతం ఆధారంగా రైతులకు పంటలపై అవగాహన కల్పించేవారు. గతంలో భూసార పరీక్షలు, సేంద్రియ ఎరువులతో పంటల మార్పిడి తదితర అంశాలపై అవగాహన కల్పించడం, వారి సలహాలతో పంటలు వేసి రైతులు అధిక దిగుబడులు పొందేవారు. గతేడాది అధిక వర్షాలకు కారణంగా రైతులకు ఆశించిన విధంగా దిగుబడి రాలేదు. కాగా, జిల్లాలో గతేడాది వానాకాలం సీజన్‌లో 4.64 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారు.

అవగాహన కల్పించాలి



పల్లెల్లో గ్రామసభ ఏర్పాటు చేసి రైతులకు అధికారులు పంటల సాగుపై అవగాహన కల్పించేవారు. ఈ ఏడాది సదస్సు నిర్వహించడం లేదు. వానా కాలంలో ఏ పంటలు వేయాలో తెలి యడం లేదు. పంటలపై అవగాహన కల్పించేలా అధికారులు సదస్సులు ఏర్పాటు చేయాలి.

– లక్ష్మణ్, బోరిగాం, రైతు

ప్రభుత్వ ఆదేశాలు రాలేదు

మన తెలంగాణ–మన వ్యవసాయం రైతు సదస్సు నిర్వహణకు ఉన్నతాధికారుల నుంచి అదేశాలు రాలేదు. ఏఈవోలు తమ క్లస్టర్‌లో ఉన్న రైతు వేదికల్లో రైతులకు వానాకాలం పంటలపై అవగాహన కల్పించేలా అదేశాలు ఇచ్చాం. వానాకాలం పంటలపై అవగాహన కల్పించేలా చూస్తాం.

– వీణా, ఏడీఏ

శాంతిభద్రతల పరిరక్షణకు కార్డన్‌సెర్చ్

- సీఐ నారాయణ నాయక్



మాట్లాడుతున్న సీఐ నారాయణ నాయక్

పెంబి: శాంతిభద్రతల పరిరక్షణకు కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ నారాయణ నాయక్ తెలిపారు. మండలంలోని ఇటిక్యాల్ గ్రామంలో శనివారం ఉదయం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరిగ్గా వాహనపత్రాలు లేని 33 బైక్‌లు, ఆరు ఆటోలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ వాహనదారులు తమవెంట వాహన పత్రాలు ఉంచుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు బైక్‌లు ఇవ్వొద్దన్నారు. గ్రామాల్లో అపరిచితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పెంబి, ఖానాపూర్, దస్తూరాబాద్, కడెం ఎస్సైలు రజినీకాంత్, శంకర్, ప్రభాకర్‌రెడ్డి, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఆర్డీవో రవికుమార్

భైంసాటౌన్: కొత్త ఓటర్ల నమోదు, జాబితాలో మార్పులు, చేర్పుల కోసం ఎన్నికల సంఘం స్పెషల్ సమ్మరీ రివిజన్ షెడ్యూల్ ప్రకటించిందని, ఇందులో భాగంగా బీఎల్‌వోలు, పర్యవేక్షకులు పోలింగ్ కేంద్రాలవారీగా ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని భైంసా ఆర్డీవో రవికుమార్ అన్నారు. భైంసాలోని తన కార్యాలయంలో తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో శనివారం ప్రత్యేక ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. 25 అక్టోబర్ 2023 నాటికి 18 ఏళ్లు నిండినవారు ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. బీఎల్‌వోలు మే 25 నుంచి జూన్ 23వరకు పోలింగ్ స్టేషన్ల వారీగా ఇంటింటి సర్వే చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు వాయిదా

ఖానాపూర్: ఎమ్మెల్యే రేఖానాయక్ పట్టణంలో శనివారం ప్రారంభించాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు వాయిదా పడినట్లు నాయకులు ప్రకటనలో పేర్కొన్నారు. గాంధీనగర్ కాలనీలోని బస్తీ దవాఖానా ప్రారంభోత్సవం, అంబేద్కర్‌నగర్, గాంధీనగర్ శివారులో గల రెంకోని వాగుపై వంతెన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిని తిరిగి ఈనెల 31న నిర్వహిస్తామని తెలిపారు.

ఆడపడుచులకు సీఎం అండ

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసారూరల్: పేదింటి ఆడపడుచులకు అండగా సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమం కోసం వివిధ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా రైతుబంధు, రైతుబీమా, ఆసరా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని అన్నారు. అనంతరం మండలానికి చెందిన 47, పట్టణానికి చెందిన 34 చెక్కులను ఆయా కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్పన, మండల ఉపాధ్యక్షుడు గంగాధర్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు గజానంద్, నాయకులు సోలంకి భీంరావు, పోతన్న, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



భైంసారూరల్: లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామానికి చెందిన యోగేష్‌కు రూ.18 వేలు, జ్యోతికి రూ.15 వేలు, రాజుకు రూ.18 వేలు సీఎం సహాయనిధి నుంచి ఆర్థికసాయం మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కులను దేగాంలోని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి నివాసంలో శనివారం లబ్దిదారులకు అందజేశారు. కన్కపూర్ సర్పంచ్ నరేశ్, ఆంజయ్య, దేవేందర్, చిన్నాయ్య, భూమన్న ఉన్నారు.

బీజేపీని ఆదరించాలి

- పార్టీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: దేశం, ధర్మం కోసం పాటుపడుతున్న బీజేపీని ఆదరించాలని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కోరారు. మండలంలోని పార్‌పెల్లి తండా, పార్‌పెల్లి గ్రామాల్లో శనివారం రాత్రి ఆయన పర్యటించారు. మహిళలు లంబాడ నృత్యంతో స్వాగతం పలికారు. ఆయన వారితో కలిసి నృత్యం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వార్డు సభ్యుడుతోపాటు 150 మంది బీజేపీలో చేరారు. ఏలేటి మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలో వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు రావుల రాంనాథ్, అయ్యన్నగారి భూమయ్య, మల్లికార్జున్‌రెడ్డి, అంజుకుమార్‌రెడ్డి, ముత్యంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, చిన్నయ్య, గోవర్ధన్, రంజిత్, రాజు పాల్గొన్నారు.



పార్‌పెల్లిలో మాట్లాడుతున్న మహేశ్వర్ రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శనివారం ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, వాకర్స్‌తో కలిసి నడిచారు. ఈసారి తనకు అవకాశం కల్పిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులను విడుదల చేయాలి

ఖానాపూర్: మానుకోట పట్టణంలో ఇళ్లులేని పేదలకు మద్దతుగా నిలిచి, అరెస్టయిన ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని లంబాడా హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు బి.గోవింద్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వభూములు కబ్జాకు గురవుతున్నా పట్టించుకోని ప్రభుత్వం ఇళ్లులేని పేదలు గుడిసెలు వేసుకుంటే అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు సూర్యాకాంత్, రోహిదాస్, దూదిరాం తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను ఆదుకోవడంలో విఫలం

- టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కె.తిలక్‌రావు

ఖానాపూర్: నిరుద్యోగులకు ఉద్యోగావకాశం కల్పించకపోవడం, వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ జనసమితి (టీజేఎస్) జిల్లా అధ్యక్షుడు కె.తిలక్‌రావు ఆరోపించారు. పట్టణంలోని విశ్రాంతి భవన ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగుల ఆత్మబలిదానాలతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం కుటుంబపాలన సాగిస్తోందన్నారు. వేల కోట్ల రూపాయల సంపాదనే లక్ష్యంగా రాష్ట్రంలో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల అమ్ముకుని నిరుద్యోగులను మోసం చేశారన్నారు. సూర్యాపేటలో జూన్ 4న నిర్వహించే తెలంగాణ జనసమితి మూడో ప్లీనరీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు దేవిదాస్, రాజు, కల్యాణ్, సంపత్‌రావు, బెన్నీ, చిన్ను, ముజ్జు, తదితరులు పాల్గొన్నారు.



ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

సారంగపూర్: బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ పేర్కొన్నారు. మండలంలోని కరుణాకర్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో శనివారం పార్టీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాలను విస్తృతం చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు ఎవరికీ మేలు జరిగిందో ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని తెలిపారు. బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలన్నారు. నాయకులు విలాస్, రాంశంకర్‌రెడ్డి, సాగర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

మామడ: ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని బీజేపీ కార్యకర్తలకు ఆ పార్టీ నాయకుడు డా.మల్లికార్జునరెడ్డి సూచించారు. మండలంలోని కొరిటికల్ గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు కొరిపెలి లింగారెడ్డి ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మల్లికార్జునరెడ్డి హాజరై మాట్లాడారు. ఎన్నికల హామీలు నెరవేర్చడంలో కేసీఆర్ విఫలమయ్యారన్నారు. జిల్లా కార్యదర్శి శ్రావణ్‌రెడ్డి, గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సయ్య, బీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు రాములు. మండల ప్రధాన కార్యదర్శులు లింగం, శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు శమంత్‌రెడ్డి, యువ మోర్చా మండల అధ్యక్షులు అరుణ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రావుల రాంనాథ్

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఖానాపూర్: ఇటీవల అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ కోరారు. పట్టణంలో గాంధీనగర్, శాంతినగర్, సుభాష్‌నగర్ కాలనీల్లో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లుల్లో నిర్వాహకులు క్వింటాల్ 5 కిలోలకు పైగా చేసే కోతలను అరికట్టాలన్నారు. జూన్ 4న కొత్తగూడెంలో నిర్వహించే ఇంటింటికీ సీపీఐ కార్యక్రమ ముగింపు సభను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు కె.రవి, ఎల్ఆర్ ఉపాలి, రమేశ్, శ్రీనివాస్, నర్సింలు, శంకర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

సంక్షిప్తంగా

అందుబాటులో విత్తనాలు,ఎరువులు

తానూరు: మండలంలోని హంగిర్గా సొసైటీ కార్యాలయంలో డీఏపీ ఎరువులు, సోయా విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు సీవో భూమయ్య తెలిపారు. కావల్సిన రైతులు ఆధార్‌తో కార్యాలయానికి వచ్చి ఎరువులు,విత్తనాలు తీసుకెళ్లాలని సూచించారు.

'ఆదర్శ'కు విద్యార్థుల ఎంపిక

కుంటాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షల్లో 9 మంది ఎంపికయ్యారు. కుంటాల ప్రాథమిక పాఠశాల నుంచి నవ్య, గాయత్రి, గజ్జ వ్వ, పింకి, మౌనిక, స్వప్న, అర్చన, చరణ్, నవీన్ ఎంపికైనట్లు హెచ్‌ఎం గజేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

ధాన్యం బస్తాల తరలింపునకు చర్యలు

కడెం: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఆందోళన చెందవద్దని ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య అన్నారు. కేంద్రాల్లో ఇబ్బందులపై లింగాపూర్ గ్రామ రైతులు శుక్రవారం రాస్తారోకో చేశారు. శనివారం లింగాపూర్, మాసాయిపేట్ గ్రామల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, ధాన్యం బస్తాలను తరలించేలా చర్యలు తీసుకున్నారు. ఆర్ఐ రాజన్న, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రైతుల ఇబ్బందులు పట్టవా?

కడెం: కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కిసాన్‌మోర్చా మండలాధ్యక్షుడు ముక్కెర గంగాధర్, సదర్‌మట్ కాలువ సమితి అధ్యక్షుడు హపావత్ రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో శనివారంఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రాల్లో గన్నీ సంచుల కొరత, తూకం వేసిన ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతుందన్నారు. ఈవిషయమై కలెక్టర్ స్పందించి రైతులకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు. నాయకులు తిరుమలయ్య, శ్రీనివాస్, రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

సారంగపూర్: మండలంలోని ఆలూరు, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఉపాధి పనులు చేపడుతున్న కూలీలకు వైద్యాధికారి సుభాష్ శనివారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వేసవిలో వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణమోహన్‌గౌడ్, వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఖానాపూర్: పట్టణంలో బీజేపీ సీనియర్ నాయకుడు సింహరాజుల ఆనంద్‌కు ఇటీవల మాతృవియోగం కలిగింది. బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ శనివారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు సంతోష్, రాము, సుధాకర్, బుచ్చన్న, మల్లయ్య, రవీందర్‌రెడ్డి, రుస్తుం, కిషన్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: గడ్‌చాంద గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు జీవన్ తండ్రి రసూల్ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. అనంతరం లోకేశ్వరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల అధ్యక్షుడు పాల గంగాధర్, నాయకులు రమేశ్, రాజశేఖర్, దేవేందర్, ప్రదీప్‌రావు, సాయి ఉన్నారు.

లీకేజీలను అరికట్టడంలో విఫలం

ఖానాపూర్: పట్టణంలో తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనేక చోట్ల తాగునీటి పైప్‌లైన్ల లీకేజీతో నీరు వృథాగా పోతుందన్నారు. లీకేజీలకు మరమ్మతు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: మండలంలోని దిలావర్‌పూర్‌లో శ్రీ రేణుకా ఎల్లమ్మ ప్రథమ వార్షికోత్సవ ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారి ఉత్సవమూర్తి విగ్రహంతో మహిళల మంగళహారతుల మధ్య ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం బైండ్లోళ్ల డప్పుచప్పుళ్ల మధ్య ఇంటింటి జోగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోతరాజుల వీరంగం అందరినీ ఆకట్టుకుంది. ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

నిర్మల్‌టౌన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి తిరిగి ఫోన్‌ను పట్టణ ఎస్సై మహేశ్ అప్పగించారు. ఈనెల 13న నిర్మల్ బస్టాండ్ సమీపంలో బుధవార్‌పేట్‌కు చెందిన సాదుల నరేశ్ ఫోన్ పోగొట్టుకున్నాడు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీని ఉపయోగించి శనివారం ఫోన్‌ను రికవరీ చేసి నరేశ్‌కు అప్పగించారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

ఖానాపూర్: ఐకేపీ వీవోఏల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఈనెల 29న నిర్వహించ తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని సంఘం ఖానాపూర్ డివిజన్ అధ్యక్షురాలు పి.లావణ్య కోరారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట 39వ రోజు వీవోఏల సమ్మెలో శనివారం ఆమె పాల్గొని మాట్లాడారు. వీవోఏల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ జాప్యానికి నిరసనగా ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. వీవోఏలు లావణ్య, బాదావత్ రవీందర్, నరేశ్, స్వరూప, రవి, వనిత, మౌనిక, రాజకళ, స్వప్న, సుదర్శన్, తదితరులు ఉన్నారు.

అర్థం లేని ఉర్దూ అక్షరాలు తొలగించాలి

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్ బస్తీ దవాఖానా బోర్డులో అర్థం పర్థంలేని ఉర్దూ అక్షరాలను వెంటనే తొలగించి సరైన అక్షరాలతో బోర్డు ఏర్పాటుచేయాలని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారులు బోర్డులో వెంటనే మార్పులు చేయాలన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

ముధోల్: బీజేపీతో అభివృద్ధి సాధ్యమని పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు మోహన్‌రావుపటేల్ తెలిపారు. 'పల్లెపల్లెకూ బీజేపీ, గడగడపకూ మోహన్‌రావుపటేల్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. పార్టీ నాయకులు సుభాష్‌జాదవ్, నిమ్మ పోతన్న, జీవన్, ఉదయ్‌కుమార్, సాయినాథ్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దు

దస్తురాబాద్: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దని ఎస్సై ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆటో యూనియన్ సభ్యులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఎస్సై మాట్లాడారు. డ్రైవర్లు మద్యం తాగి ఆటోలను నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహన ధ్రువపత్రాలు తమవెంట తెచ్చుకోవాలన్నారు. ప్రతి ఆటో సభ్యుడు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. ఆటో యూనియన్ సభ్యులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కడెంలో..

కడెం: ఆటో, జీపు తదితర ప్రైవేటు వాహనదారులు సరైన ధ్రువపత్రాలను కలిగి ఉండాలని ఎస్సై రాజు అన్నారు. మండల కేంద్రంలో వాహనాల ధ్రువపత్రాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు ఎస్సై పలు సూచనలు చేశారు.